క్లుప్తంగా

వెండి తీర్థపు గిన్నె వితరణ



వెండి తీర్థపు గిన్నెను వితరణగా అందిస్తున్న భక్తుడు

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఓ భక్తుడు 130 గ్రాముల వెండితో తయారు చేసిన తీర్థపు గిన్నెను ఆలయ చైర్మన్ సి.సుధీకర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులకు విరాళంగా అందించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పి.మాధవాచారి, ఆలయ ఈఓ రమణ, ఆలయ పూజారి శివస్వామిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ పార్కు, వైఎస్సార్ విగ్రహ సుందరీకరణ, రోడ్డు సుందరీకరణ, బటర్‌ఫ్లై లైట్లను వారు పరిశీలించి తగిన సూచనలను అందించారు. అలాగే ఈనెలాఖరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఉన్న నేపథ్యంలో హెలీప్యాడ్ స్థలాన్ని మార్పులు చేర్పులు చేయడంతో ఆ స్థలాన్ని పరిశీలించారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి బీమా అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

చెన్నూరు : స్థానిక అరుంధతినగర్‌కు చెందిన చెప్పలి నాగార్జున(36) ఇటీవల మరణించారు. వీరి కుటుంబానికి వైఎస్సార్ జీవిత బీమా వర్తించడంతో బీమా పథకంలో భాగంగా వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 వేలను సోమవారం ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సర్పంచ్ వెంకటసుబ్బయ్య అందజేశారు. కార్యక్రమంలో మూడవ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ చైతన్య, సచివాలయం కన్వీనర్ సుధాకర్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన దృశ్యం

జమ్మలమడుగు : మండలంలోని ఎస్.కొట్టాలపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు మెటీరియల్‌ను పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఎత్తపు దస్తగిరిరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. 30 మంది విద్యార్థులకు యుటీఎఫ్ ఆధ్వర్యంలో పాస్‌గ్యారంటీ పేరుతో ముద్రించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పాఠశాల చైర్మన్ పుస్తకాలను పంపిణీ చేశారన్నారు.

సందడి చేసిన జబర్దస్త్ వర్ష



షోరూంలో జబర్దస్త్ వర్ష, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దొరసానిపల్లె రోడ్డులోని శ్రీ సీవీఎస్ మౌలిక శిల్క్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, జబర్దస్త్ నటి, యాంకర్ వర్ష పాల్గొని కేక్ కట్ చేశారు. అక్కడకు వచ్చిన అభిమానులతో సెల్ఫీలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య నూతన సంవత్సరం అందరికి శుభాలు తేవాలని ఆకాంక్షించారు. సంఘం వైస్ ప్రసిడెంట్ జీసీ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని అర్హులైన వారందరికి ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లను, టీడ్కో ఇళ్ల పనులను మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి పరిశీలించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇళ్లు మంజూరు చేయిస్తామని అంతే ఇళ్ల తీసుకున్న లబ్దిదారులు బ్యాంకులో రుణాలు చెలించాలని పిట్టింగ్ పెట్టిందన్నారు. అయితే మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఒక్క పైసా తీసుకోకుండానే ఉచితంగా ఇళ్లను నిర్మించి లబ్దిదారుల పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. అనంతరం పట్టణంలోని సుందరయ్య కాలనీలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించి త్వరగా బ్రిడ్జిని ప్రారంభానికి సిద్ధం చేయాలని కమిషనర్ పి.జగన్నాథ్‌ను ఆదేశించారు. అలాగే సీసీ రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు.

దోబీఘాట్ నిర్మాణానికి విరాళం

మండలంలోని సిరిగేపల్లెలో రజకుల కోసం దొబిఘాట్ నిర్మాణానికి రూ.50 వేలు నగదును ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం అందజేసి మాట్లాడారు. రజకుల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయుత ద్వారా సాయం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డితో కలసి 14వ వార్డులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి ఆ పథకం యొక్క పూర్తి సమాచారాన్ని వివరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సక్రమంగా అమలు చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు ఒప్పుకుంటేనే వచ్చేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో లబ్ధిదారులనే పథకాలు వెతుక్కుంటూ వస్తున్నాయని వివరించారు. సుపరిపాలన దీర్ఘకాలంగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, 14వ వార్డు కౌన్సిలర్ జంషద్, వార్డు ఇన్‌చార్జి షాహిద్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

పొలతలలో టెంకాయల విక్రయానికి వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో టెంకాయ విక్రయం, టోల్‌గేట్, కొబ్బరి చిప్పలకు సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డిల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. తలనీలాల సేకరణ వేలం పాటకు ఎవరు రాకపోవడంతో వాయిదా వేశారు. టెంకాయ విక్రయానికి విడి దినాల్లో రూ.6.65 లక్షలు, తిరునాల మూడు రోజులు టెంకాయల విక్రయం వాయిదా వేశారు. టెంకాయ చిప్పల సేకరణకు రూ.5.41లక్షలు, విడి దినాల్లో టోల్ గేట్‌కు రూ.3.10 లక్షలు, మహాశివరాత్రి మూడు రోజులకు టోల్ గేట్ రూ.2 లక్షలు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనువాసులు, ఆలయ మాజీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల నిరసన



కలమల్ల గ్రామ సచివాయలం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 12 మంది స్వీపర్స్ కార్మికులు తమకు జీతాలు ఇవ్వాలంటూ సోమవారం కలమల్ల గ్రామ సచివాలయం-1 వద్ద సచివాలయ సిబ్బందిని లోనికి వెళ్లనివ్వకుండా బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నెల నెల జీతాలను ఆయా సర్పంచ్‌లు ఇచ్చేవారన్నారు. అయితే ఈ సారి కలమల్ల గ్రామ పంచాయతీలో బీజేపీ, టీడీపీ భాగస్వామ్య అభ్యర్థి సర్పంచ్‌గా ఎన్నికైన విషయం తెలిసిందేనన్నారు. కానీ సర్పంచ్‌ను నామ మాత్రంగా పెట్టి బీజేపీ, టీడీపీ నాయకులు సర్పంచ్ బాధ్యతలు చెపట్టి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వమంటే ఇవ్వలేదన్నారు. మేము పనులు చేసి మా జీతాల కోసం బీజేపీ, టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రతి నెల అడుక్కోవాలని లేదంటే జీతాలు వేయమని అంటు బెదిరిస్తున్నారని వారు వాపోయారు. అయినా మాకు జీతాలు పెట్టాలంటే పంచాయతీ సెక్రటరీ కానీ, సర్పంచ్ కానీ లాగిన్‌లో వేలిముద్రలు వేసి జీతాలు ఇవ్వాల్సిందన్నారు. అయితే ఆ మూడో వ్యక్తుల పెత్తనం మాపై ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కలమల్ల గ్రామంలో ఉమ్మడి సర్పంచ్ పాలన రాజ్యమేలుతుందన్నారు. సర్పంచ్‌ను నామ మాత్రంగా పెట్టి మూడో వ్యక్తులు అధికారం చెలాయిస్తున్నారని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో కలమల్ల ఉపసర్పంచ్ విజయలక్ష్మీ, వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ భాగ్యలక్ష్మీని వివరణ కోరగా కార్మికులు జీతాలు వెంటనే వెయిస్తామని తెలిపారు. వెంటనే ఈఓపీఆర్డీ రంతుల్లయ్యకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

క్రీడలలో విజయాలను సొంతం చేసుకోవాలి



విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలలో మంచి విజయాలను సొంతం చేసుకోవాలని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో ద్వితీయ స్థానం సొంతం చేసుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. ఈనెల 17న సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన టార్గెట్ బాల్ పోటీలలో రాణించి 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు వివరించారు. జనవరి 13, 14, 15వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్, ఎండీలు చేతన్‌రెడ్డి, చైతన్యారెడ్డిలు అభినందించారు. విద్యార్థులకు ప్రొత్సాహక మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు.


శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు వెడల్పు నిర్మాణ పనులు

వేంపల్లె : పట్టణంలోని కడప, పులివెందుల, గండి రోడ్లలో 72 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటరమణ తెలిపారు. అందుకు సంబంధించి ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్డు కిరువైపులా నాలుగు అడుగుల మేర ఫుట్‌పాత్ మధ్యలో డివైడర్, లైటింగ్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నామన్నారు. అలాగే రూ.92 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆరు నెలల్లోపు ఈ పనులన్ని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థినులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

చెన్నూరు : ఈనెల 14, 15 తేదీలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కౌశల్ పరీక్షలో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను సోమవారం ఎంఈఓ గంగిరెడ్డి ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కౌశల్ పరీక్ష లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ మన విద్యార్థులు కౌశల్ పరీక్ష నందు జిల్లా మొదటి ర్యాంకు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవి మాట్లాడుతూ 8వ తరగతి నాగతేజశ్రీ వర్మ, 9వ తరగతి వర్షిని, పదవ తరగతి నిర్మల టీమ్ పాల్గొనగా వీరికి కోఆర్డినేటర్‌గా వీరశేఖర్ తమ సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సునీత, ఎంఆర్సీ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతి సిమెంట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ సాదుం పద్మలత తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయ నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్ అవసరమైతే ఉచితంగా చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేతనాలు పెంచాలని ర్యాలీ

కమలాపురం : వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని అంగన్‌వాడీలు ర్యాలీ చేపట్టారు. అలాగే మానవహారం ఏర్పాటు చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్రాస్ రోడ్డు నుంచి ప్రాజెక్ట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించగా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అలాగే ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు నల్లదుస్తులు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.

ఆరోగ్యశ్రీ నిధుల పెంపు పేదలకు వరం

సింహాద్రిపురం : పేదలకు వైద్యం ఆర్థికభారం కాకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ సేవల నిధులు రూ.25 లక్షలకు పెంచారని మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ సేవల పెంపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవల నిధులు రూ.25 లక్షలకు పెంచడంవల్ల పేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు సమాజానికి మార్గదర్శకులు

బద్వేలు అర్బన్ : నేటి సమాజానికి వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, వారి అనుభవాలు ఎంతో మార్గదర్శకమని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని కష్టనష్టాలను కుటుంబంలా భరిస్తూ పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పదవీ విరమణ పొందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా సంఘం ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న గానుగపెంట హనుమంతరావు తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

మైదుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈనెల 21వ తేదీ గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహణపై సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21న ఉదయం 8.30 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఉదయం 10 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందన్నారు. మైదుకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు సీఎం వైఎస్ జగన్ జన్మదిన కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం 11.30 గంటలకు జెడ్పీ హైస్కూల్ మైదానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సీఎం వైఎస్ జగన్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీఐఐసీ, ఆప్కో డైరెక్టర్లు డి.గంగాధర్‌రెడ్డి, ఉదయగిరి వెంకటేష్, నియోజకవర్గంలోని చాపాడు, బి.మఠం, ఖాజీపేట, దువ్వూరు, ఎంపీపీలు కె.లక్షుమయ్య, సి.వీరనారాయణరెడ్డి, అబూబకర్ సిద్దిక్, కె.జయచంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, మైదుకూరు వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల ఇన్‌చార్జి

వేముల : రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను విస్తృత పరిచి అమలు చేస్తున్న ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ విస్తృత సేవలు ఎలా పొందాలనే పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు ఆరోగ్యశ్రీని మరింత చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందేలా విస్తృతపరిచారన్నారు. వైద్య చికిత్సల కోసం అప్పుల పాలు కాకుండా కార్పొరేట్ ఆసుపత్రులలో ఖరీదైన వైద్యం అందించే విధంగా ఈ పథకం ద్వారా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సేవలు విస్తృత పరిచి అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఆసుపత్రుల వివరాలను పొందుపరిచి వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసి వారి మొబైల్స్‌లలో ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఈ పథకం ద్వారా ఉచితంగానే వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతపరిచిందని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మండి మాపీరా, వైద్యాధికారిణి శరణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ సంజీవిని లాంటిదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. సోమవారం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచిన సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ యరసాని నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ సిద్ధిగారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు టీఎన్ చంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఎస్టీ సెల్ శ్రీనివాసనులు, మండల వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

పెద్దముడియం : మండలంలో 2022-2023 మధ్య చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన ఉపాధి పనులపై నేడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కింద 1183 పనులకు గాను రూ.6.15 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆయా పనులపై ఒక ఎస్ఆర్పీ, 8 మంది డీఆర్పీలు 20 రోజుల పాటు గ్రామాల్లో తనిఖీ చేశామన్నారు. బహిరంగ సభకు మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, వెలుగు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, తప్పక హాజరు కావాలని తెలిపారు.

కాలేటి వాగు ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి



కాలేటి వాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చక్రాయపేట : కాలేటి వాగు ప్రాజెక్టు రైతులకు వరప్రదాయని అని.. ఆ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం చక్రాయపేట మండలంలోని కాలేటి వాగు ప్రాజెక్టును ఆయన బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మండలంలో ప్రజల కరువు నివారణ కొరకు 30 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ భారీ ప్రాజెక్టు ప్రభుత్వం నిధులను మంజూరు చేసి రైతులను సత్వరం ఆదుకోవాలన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు భూమి నష్టపరిహారం అందించడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం, అవినీతికి పాల్పడుతున్నారన్నారు. అలాగే కల్లూరుపల్లెలోని గుర్రంవాని కుంటను పరిశీలించి ఈ చెరువు పనులు పూర్తి చేసి కరువు రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం



సుజాతమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పులివెందుల టౌన్ : పులివెందులలో 1973-75 ఇంటర్మీడియట్ బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు తమ పూర్వపు విద్యార్థిని సుజాతమ్మ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. సోమవారం పూర్వపు విద్యార్థుల తరపున వి.వి.కొండారెడ్డి, రాజేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయ్‌మోహన్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, షణ్ముగ వర్మలు తమ క్లాస్‌మేట్ సుజాతమ్మ ఇంటి వద్దకు వెళ్లి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులందరూ కలిసి ఆర్థిక సాయం చేయడంపట్ల సుజాతమ్మ హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శతక పద్యార్చన పెద్దల పట్ల గౌరవం పెంచుతుంది



పోట్లదుర్తిలో విద్యార్థులతో పద్యార్చన చేస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తానా అమ్మ నాన్న గురువు శతక పద్యార్చన కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శివరాం తెలిపారు. వందేవిశ్వమాతరమ్ పేరుతో తానా వంద దేశాలలో వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో శాంతి సద్భావన యాత్ర నిర్వహిస్తోందని అందులో భాగంగానే మండలంలోని పోట్లదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

పులివెందుల రూరల్ : స్థానిక రవీంద్రనాథ ఉన్నత పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం కదిరి రోడ్డులో ఉన్న విజయ్ గార్డెన్స్‌లో 23 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేస్తూ వారిని ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థులలో ఎవరికైనా కష్టాలు వస్తే ఒకరికొకరు అండగా ఉండి ఆ కష్టాలను తీర్చి స్నేహితుల అభివృద్ధికి పాటుపడాలని నిశ్చయించుకున్నారు.